

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడిగింపు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం మరో అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల కోసం జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.




### సంగారెడ్డి జీజీహెచ్‌లో
# క్యాన్సర్ చికిత్స వార్డు

నేడు క్యాన్సర్ డే-కేర్ సెంటర్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న మంత్రి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్యాన్సర్ డే-కేర్ సెంటర్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ వర్చువల్‌గా నేడు ప్రారంభించనున్నారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీలోని లెక్చరర్ హాల్ నుంచి ఉదయం 11 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిర్మించిన క్యాన్సర్ డే-కేర్ సెంటర్‌లను మంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను సోమవారం మెడికల్ కాలేజీతో పాటు జనరల్ ఆస్పత్రి అధికారులు పరిశీలించారు.

**అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు**

క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి జిల్లాలోని బోధనాస్పత్రుల్లో ప్రత్యేకంగా వైద్య సేవలందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక వార్డులో క్యాన్సర్ బాధితులకు చివరి వరకు నొప్పి, బాధ తెలియకుండా ఈ ప్రత్యేక వార్డులో మందులు, ఫిజియోథెరపీ, వైద్య సేవలందిస్తున్నారు. మంచానికే పరిమితమైన రోగులకు సాంత్వన చేకూర్చేలా వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ వార్డుకు అనుబంధంగానే నూతనంగా 10 పడకల జిల్లా క్యాన్సర్ చికిత్స వార్డు నెలకొల్పారు. ఈ వార్డులో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రోగ నిర్ధారణ, కిమోథెరపీ, తదితర చికిత్సలు అందిస్తారు. రోగుల జీవన నాణ్యతను మెరుగుపడటంతో పాటు క్యాన్సర్ మహమ్మారితో పోరాడే సమాజ సామర్థ్యాన్ని పెంచేందుకు క్యాన్సర్ చికిత్స వార్డు దోహదపడనున్నది.

- సంగారెడ్డి జిల్లాలో నోటి క్యాన్సర్‌తో 78 మంది, బ్రెస్ట్ క్యాన్సర్‌తో 61 మంది, సర్వైకల్ క్యాన్సర్‌తో 68 మంది, ఇతర క్యాన్సర్ల 147 మంది బాధపడుతున్నారు. 414 మంది పాలియేటివ్ కేర్ సర్వీసెస్ అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

# నిర్ణయం ఆమెదే..

మెదక్ జిల్లాలో మహిళా ఓటర్లే అత్యధికం

**మహిళలు 2,71,787 మంది నమోదు.. పురుష ఓటర్లు 2,51,532**

**గత ఎన్నికలతో పోలిస్తే మొత్తం 64 వేల మంది ఓటర్లు అధికం**

**జిల్లాలో 21 జడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలు**

మెదక్ జిల్లాలో తాజాగా విడుదలైన ఓటర్ల జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఈ పరిణామం జిల్లా రాజకీయాల్లో మహిళల ప్రభావం పెరుగుతున్నట్లు సూచిస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ వ్యూహాలను మహిళా ఓటర్లను ఆకర్షించే విధంగా మార్చుకోవాల్సి వస్తోంది.

మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. మెదక్ జిల్లాలో 21 జిల్లా పరిషత్ స్థానాలు, 190 మండల పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం 1052 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత రేపు తుది జాబితాను ప్రకటించనున్నారు.



మెదక్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలే కీలక పాత్ర పోషించనున్నారు. తాజాగా విడుదలైన ఓటర్ల జాబితా ప్రకారం మెదక్ జిల్లాలో మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా నమోదు కావడం ప్రత్యేకతగా నిలిచింది. 2,27,787 మంది మహిళా ఓటర్లు, 2,51,532 మంది పురుష ఓటర్లు, ఇతరులు ఎనిమిది మంది (మొత్తం ఓటర్లు 5,23,327) ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. 2018లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 4,58,924 మంది ఓటర్లు ఉండగా, ఈసారి మొత్తం 64,403 మంది ఓటర్లు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పుడు పురుష ఓటర్లు 2,23,794 మంది, మహిళా ఓటర్లు 2,35,111 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. జిల్లా రాజకీయాల్లో మహిళా ఓటర్లు కీలక శక్తిగా ఎదుగుతున్నారు. వారు ఎవరి వైపు మొగ్గు చూపితే విజయం వారిని వరిస్తుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈమేరకు పార్టీలన్నీ తమ వ్యూహాలను సవరించుకోవాల్సి వస్తోంది.

**1,052 పోలింగ్ కేంద్రాలు**

జిల్లాలో 21 జిల్లా పరిషత్ స్థానాలు, 190 మండల పరిషత్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 21 జడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలకు జరగనున్న ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,052 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా తదితర అంశాలపై చర్చించారు. ముసాయిదా ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు పరిశీలించిన తర్వాత తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ఈ నెల 10వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో సెల్‌ఫోన్‌ను డిపాజిట్ చేస్తున్న డ్రైవర్

# ఆర్టీసీ డ్రైవర్లకు.. నో ఫోన్

సంగారెడ్డి డిపోలో ప్రయోగాత్మకంగా అమలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతే ప్రధానంగా ఆర్టీసీ సంస్థ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. డ్రైవర్లు అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సంస్థ భావిస్తోంది. ఇందులో భాగంగా విధి నిర్వహణలో డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా పదకొండు రీజియన్లలో ఒక్కో డిపోను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. మెదక్ రీజియన్ పరిధిలో సంగారెడ్డి డిపోలో ప్రయోగాత్మకంగా 'నో సెల్‌ఫోన్'ను అమలు చేయనున్నారు.

**విధుల్లోకి వెళ్లే ముందే డిపాజిట్**

సంగారెడ్డి డిపో పరిధిలో 160 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. వారంతా విధుల్లోకి వెళ్లే ముందు తమ సెల్‌ఫోన్‌ను డిపో సెక్యూరిటీ అధికారికి అప్పగించాలని సూచించారు. ఫోన్ నంబర్, పేరు, చిరునామా, సెల్‌ఫోన్ మోడల్ రాసుకొని టోకెన్ జారీ చేసి సెల్‌ఫోన్ డిపాజిట్ బాక్స్‌లో వేస్తారు. విధులు ముగిశాక సంతకం చేసి తీసుకోవాల్సి ఉంటుంది. విధుల్లో ఉన్న డ్రైవర్‌కు ఏదైనా సమాచారం చేరవేయాల్సి వస్తే డ్రైవర్‌తో పాటు వెళ్లే కండక్టర్ సెల్‌ఫోన్ నంబరు సెక్యూరిటీ రిజిస్టర్‌లో రాసుకుంటారు. అత్యవసర సమాచారం ఉంటే కండక్టర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తారు.

**ప్రయాణికుల భద్రత కోసమే : డీఎం**

ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగారెడ్డి డిపోలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, డ్రైవర్లు సహకరిస్తున్నారని డీఎం పి.ఉపేందర్ తెలిపారు. నూతన విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## యూరియా బాధలు.. రోడ్డెక్కిన రైతులు

గంటల తరబడి నిరీక్షించినా బస్తా దొరక్కపోవడంతో ధర్నాలు, రాస్తారోకోలు



శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

7

## సిగాచిపై పోరుబాట

- బాధితుల పక్షాన ప్రజాసంఘాలు
- ఇప్పటికీ పావువంతే పరిహారం
- యజమాన్యంపై చర్యలు శూన్యం
- ఉద్యమానికి సిద్ధపడుతున్న పౌరసంఘాలు
- నేడు ముత్తంగిలో
- రౌండ్ టేబుల్ సమావేశం



7

## కస్తూర్బాలో వైరల్ ఫీవర్..!

- ఝరాసంగంలో కలకలం
- తనిఖీ చేసిన అధికారులు
- వైద్యం శిబిరం ఏర్పాటు
- డ్రైనేజీ పొంగిపొర్లడంపై
- ప్రత్యేకాధికారిపై ఆగ్రహం

6



# కట్టెల పొయ్యే దిక్కు..

మధ్యాహ్న భోజన కార్మికుల వెతలు

గ్యాస్ కనెక్షన్ల మంజూరుపై గందరగోళం

సిలిండర్ల పంపిణీపై స్పష్టత కరువు

వంట కార్మికుల ఆర్థిక భారం



మెదక్ అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి గ్యాస్ కనెక్షన్ల మంజూరుపై ప్రతిష్టంభన నెలకొంది. ఎల్‌పీజీని వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు అమలుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల కొనుగోలు, నిర్వహణ ఖర్చులపై స్పష్టత లేకపోవడంతో వంట ఏజెన్సీలు ఆర్థిక భారం మోయలేమంటూ విముఖత చూపుతున్నాయి. దీంతో, ఆగస్టు 15 నాటికి అన్ని పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు పూర్తి చేయాలన్న లక్ష్యం నెరవేరలేదు.

**జిల్లాలో 625 పాఠశాలల్లో 1,421 కార్మికులు**

మెదక్ జిల్లావ్యాప్తంగా 885 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 261 పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా భోజనం అందిస్తున్నారు. మిగిలిన 625 పాఠశాలల్లో 1421 మంది వంట కార్మికులు మధ్యాహ్నం భోజనం వండుతున్నారు. ఈ పాఠశాలలకు ఉచితంగా గ్యాస్‌స్టవ్, సిలిండర్ అందిస్తామని ప్రభుత్వం ఇంతకుముందు ప్రకటించింది. జిల్లాలోని 17 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ల సరఫరాకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా మంజూరు చేసినప్పటికీ, అదనంగా మూడు సిలిండర్లు కొనుగోలు చేయడానికి రూ.12 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కనెక్షన్లు, పొయ్యిలు సమకూర్చినప్పటికీ, నెలవారీ గ్యాస్ సిలిండర్ కొనుగోలుకు నిధులపై స్పష్టత లేదు. ఒక పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నెలకు సగటున 15 సిలిండర్లు అవసరమవుతాయి. దానికి రూ. 15 వేలు కావాలి. ఇప్పటికే మధ్యాహ్న భోజన సరుకులు, కోడిగుడ్లు, కూరగాయాల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో ఏజెన్సీలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. గ్యాస్ సిలిండర్ ఖర్చు కట్టెల పొయ్యి కంటే ఎక్కువ అవుతుంది. దాంతో వారిలో ఆందోళనను మరింత పెంచుతోంది. గ్యాస్ కనెక్షన్ల అమలు విజయవంతం కావాలంటే ప్రభుత్వం నెలవారీ సిలిండర్ సరఫరాకు నిధులు కేటాయించి, ఏజెన్సీల ఆర్థిక భారాన్ని తగ్గించాలి. లేకపోతే గ్యాస్ కనెక్షన్ల పథకం కేవలం కాగితంపైనే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

## సంగారెడ్డి ఆర్డీవోపై వేటు

*పోస్టింగ్ ఇవ్వకుండానే బదిలీ*

పటాన్‌చెరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే రిలీవ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఓ కార్పొరేటర్‌కు అనుకూలంగా పటాన్‌చెరులోని 10 ఎకరాల నిషేధిత భూములకు హక్కులు కల్పించినట్టు ఆయనపై ఆరోపణలున్నట్లు అధికార వర్గాలు చెపుతున్నారు. జిన్నారం మండలంలో గజ్వేల్ ప్రాంతానికి బీఆర్ఎస్ నాయకుడు ఓ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించి స్పష్టత లేని 80 ఎకరాలను దారాదత్తం చేసినట్టు ఆరోపణలున్నాయి. ముత్తంగి, రుద్రారం, కంది గ్రామాల్లోని విలువయిన అసైన్డ్ భూములకు హక్కులు కల్పించినట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందాయి. ఐలాపూర్ భూముల వ్యవహారంలోనూ స్థానికులు ఫిర్యాదులు చేశారు. రామచంద్రాపురం మండల తహశీల్దార్ పరిధి వెలిమెల గ్రామంలో రెండు జిల్లాల సరిహద్దు భూముల విషయంలో నేరుగా పైరవీకారుడుగా మారినట్టు ప్రచారం జరిగింది. రూ. 2వేల కోట్ల విలువైన 60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ రియల్టర్‌కు దారాదత్తం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన సీసీఎల్‌ఏ అధికారులు సంబంధించిన లావాదేవీలు నిలిపేసినట్టు తెలిసింది. పటాన్‌చెరు, రామచంద్రాపురం, కంది, అమీన్‌పూర్, జిన్నారం మండలాలకు చెందిన అన్ని రకాల ఫైళ్ల మాదాపూర్‌లోని రియల్‌ఎస్టేట్ కార్యాలయానికి తెప్పించుకొని రాత్రికిరాత్రి సర్దుబాట్లు చేసినట్లు ఆర్డీవోపై ఆరోపణలు ఉన్నాయి.



దన్నురలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

# పల్లెల ప్రగతికి కట్టుబడి ఉన్నాం

*వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ*

టేక్మాల్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పనులు చేపడుతున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండలంలో పలు రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాట్లడుతూ విద్యా సంస్థల్లో నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో కోట్లాది రూపాయలతో వివిధ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎల్లుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్యాధికారి శ్రీరాం, డీఎస్పీ ప్రసన్నకుమార్, తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీవో రియాజొద్దీన్, జోగిపెట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద చెరువు నీళ్లన్నీ కర్ణాటక పాలు

కోహీర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి పెద్ద చెరువు నిండా నీరున్నా ఆయకట్టుకు చుక్క నీరు అందడం లేదు. 1960 లో నిర్మించిన చెరువు కింద 11వందల ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో ఈ చెరువు నీటితో రైతులు మూడు పంటలు పండించేవారు. కానీ ఇప్పుడు కాల్వలు శిథిలావస్థకు చేరుకోవడం, పూడిక పేరుకుపోవడంతో వర్షాలు కురిసి చెరువు నిండినా నీరంతా దిగువన కర్ణాటకకు పోతోంది.

**బీడుగా మారిన ఆయకట్టు**

**196 ఎకరాల్లో చెరువు నిర్మాణం**

గొటిగర్‌పల్లి గ్రామ సమీపంలో 196 ఎకరాల్లో పెద్ద చెరువును నిర్మించారు. ఇందుకోసం రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 1100 ఎకరాలకు సాగునీరందేది. పదేళ్లుగా చెరువు నిర్వహణ లోపించడంతో చెరువు వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పొలాలకు నీరందించేందుకు గతంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని పనులు చేపట్టినా నిర్మాణంలో జాప్యంతో దొంగలు మోటార్లను ఎత్తుకెళ్లారు. అప్పటినుంచి చెరువును పట్టించుకునేవారే కరువయ్యారు. చెరువు పునరుద్ధరణ కోసం రైతులు చాలాసార్లు అధికారులను అభ్యర్థించడంతో ఆరేళ్ల క్రితం ఇరిగేషన్‌శాఖ అధికారులు చెరువు మరమ్మతులు, కాల్వల పునరుద్ధరణ కోసం రూ. 4.89 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. ఆయకట్టు రైతులు మాట్లాడుతూ చెరువు కట్ట, కాలువలను బాగు చేసి రైతులకు నీరందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# మామిడిపల్లిలో కుంట శిఖం భూమి కబ్జా

**హైవే పక్కనే రూ.4 కోట్ల విలువైన భూమికి ఎసరు**

**చుట్టూ ఫెన్సింగ్ వేసి వరి నాటు**

**పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు**

కంది, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంది మండలంలో చెరువులు, కుంటలు, శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జా పాలవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కంది మండలం మామిడిపల్లి శివారులోని సర్వే నంబరు 561లో ఆరు ఎకరాల్లో ఊరకుంట ఉన్నది. కుంట పక్కనే 161వ నంబరు హైవే ఉండటంతో భూమి విలువ ఎకరా రూ. 8 కోట్లు పలుకుతున్నది. మధ్య నుంచి రోడ్డు వేయడంతో కుంట శిఖం భూమి రెండుగా చీలింది. రోడ్డుకు ఎడమవైపు అర ఎకరం మేర మిగిలింది. కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. రూ.4 కోట్లు విలువైన శిఖం భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి పొలంగా మార్చి వరి నాటు వేశారు. జాతీయ రహదారి పక్కనే విలువైన భూమి ఆక్రమించినా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తెలియకపోవడం గమనార్హం.



వరి నాటు వేసిన ఊరకుంట శిఖం భూమి

**అధికారులు స్పందించడం లేదు**



మామిడిపల్లిలో హైవే 161 పక్కన ఉన్న ఊరకుంట శిఖం అర ఎకరం భూమిని కొందరు కబ్జా చేశారు. ఈ విషయంపై రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. శిఖం భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి వరి నాటు వేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి కుంట శిఖంను కబ్జా చెర నుంచి విరిపించాలి.

**-అంబర్‌సింగ్, రైతు, మామిడిపల్లి**

**చెరువులను కబ్జా చేస్తే చర్యలు**

మండలంలో చెరువులు, కుంటలు, శిఖం భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మామిడిపల్లిలో ఊరకుంట చెరువు, శిఖంను సర్వే చేయించి హద్దులు గుర్తించి రక్షణ ఏర్పాట్లు చేస్తాం. కబ్జా చేసినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం.

**- మజార్, నీటి పారుదలశాఖ ఏఈ**

**ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు**

చెరువులు, కుంటలు, శిఖం భూములు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అక్రమంగా వేసిన పంటను స్వాధీనం చేసుకుంటాం. త్వరలోనే ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలకు రక్షణగా కంచెలను ఏర్పాటు చేసి సూచికల బోర్డులు పెట్టిస్తాం.

**-రవికుమార్, తహసీల్దార్**

## అర్ధరాత్రి కారు బీభత్సం


ధ్వంసమైన కారు

రామాయంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగం.. అజాగ్రత్తగా కారు నడపగా రోడ్డు పక్కన ఉన్న పానీ పూరి బండి ధ్వంసమైంది. అంతటి వేగానికి పగటిపూట అయితే ప్రాణాలే పోయేవి. అర్ధరాత్రి కావడంతో జన సందడి లేక పెను ప్రమాదం తప్పినట్లైంది. కామారెడ్డి వైపు నుంచి పాత హైవేపై సిద్దిపేట చౌరస్తాలో ఉన్న ఓ హోటల్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారు నడుపుతున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కారును తొలగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కస్తూర్బాలో వైరల్ ఫీవర్..!


పాఠశాల ఆవరణలో గల డ్రైనేజీని పరిశీలిస్తున్న అధికారులు

ఝరాసంగం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఝరాసంగం కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని పలువురు విద్యార్థినులు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కరుణకుమార్ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీ చేపట్టారు. అక్కడ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న విద్యర్థినులను ఆయన పలకరించారు. స్థానిక వైద్యాధికారికి ఫోన్ చేసి విషయం చెప్పి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించారు. పాఠశాల ఆవరణలో గల డ్రైనేజీ నుంచి విపరీతమైన దుర్గంధం వెదజల్లడంతో ఆయన ప్రత్యేక అధికారి పనితీరుపై ఆగ్రహం చెందారు. పాఠశాలలోని స్టోర్ రూంలో నిల్వ ఉంచిన కూరగాయలు, అరటి పండ్లకు దోమలు, ఈగలు వ్యాప్తి చెందడం చూసి పిల్లలకు ఇలాంటి ఆహారం అందజేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా విద్యార్థినులకు అందజేసే బియ్యంలో తెల్లని పురుగు కనిపించడంతో మండిపడ్డారు. అడిగిన వాటికి సరైన సమాధానం ఇవ్వకుండా పొంతన లేని సమాధానలు ఇవ్వడం సరికాదన్నారు. ఇక్కడి పరిస్థితులపై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తానన్నారు. ఈ విధమైన ఆహారం అందజేయడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రత్యేక అధికారి పనితీరుపై సీపీఎం నాయకులు చంద్రన్న జిల్లా అధికారులకు సమాచారం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐలు రామరావు, సాయి కుమార్‌లు ఉన్నారు.

## షో కాజ్ నోటీసులు ఇచ్చారంటూ..

● 'డబుల్' లబ్ధిదారుల ధర్నా

జోగిపేట, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ధర్నాకు దిగిన ఘటన సోమవారం జోగిపేటలో చోటుచేసుకుంది. అధికారులు రెండేళ్ల క్రితం అందోలు, జోగిపేట జంట పట్టణాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. అయితే, కొందరు లబ్ధిదారులు.. తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులకు అమ్ముకోగా, మరి కొందరు ఇతరులకు అద్దెకిచ్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి.. దీంతో ఆర్డీవో అధికారులు పలువురు లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చారు. మీకు కేటాయించిన డబుల్ ఇళ్లల్లో మీరు ఉండడంలేదని, ఇతరులు ఉంటున్నారని అంటూ, మూడు, నాలుగు రోజుల్లోగా సరైన కారణాలు తెలపాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మీకు కేటాయించిన ఇళ్లను మేము వెనక్కి ఎందుకు తీసుకోకూడదో తెలపాలంటూ షో కాజ్ నోటీసులు ఇచ్చారు. ఈక్రమంలో పలువురు లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, మెమోరాండం సమర్పించేందుకు కార్యాలయం లోపలికి వెళ్లారు. అయితే మంత్రి పర్యటన ఉన్న కారణంగా అధికారులెవరూ లేకపోవడంతో వెనుదిరిగారు. తాము ఇంట్లో లేకుండా పనికి వెళ్లినప్పుడు అధికారులు ఎంక్వయిరీ చేసి నోటీసులు అతికించారని వారు మండిపడ్డారు. వెంటనే అధికారులు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ జిల్లా నాయకుడు పీ.నా రాయణ, సీపీఎం డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్...వీరికి సంఘీభావం గా ధర్నాలో పాల్గొన్నారు..

## షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చిలప్‌చెడ్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): షాట్ సర్క్యూట్ తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామ పంచాయతీ కొత్తకుంట తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకి చెందిన బానోత్ రమేష్ ఇంట్లో ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్ అవడంతో ఇంట్లో నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, బీరువాలో సామాన్లు, వస్తువులు, తినుబండరాలు ,నాలుగు క్వింటాల బియ్యం, దుస్తులు,రూ.13వేల రూపాయలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలను గమనించిన తండావాసులు నీటితో మంటలను చల్లార్చారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో రమేష్ కుటుంబం కట్టుబట్టలతో బయటే ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు, విద్యుత్ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించిన ఆర్ఐ సునీల్ చౌహాన్ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామని తెలిపారు.

## ఎల్లయ్య సేవలు చిరస్థాయిగా మిగిలిపోతాయి


ప్రసంగిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్

భెల్‌కాలనీ,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనకు అహర్నిశలు కృషి చేసిన పోరాటయోధుడు ఎల్లయ్య సేవలు బీహెచ్ఈఎల్ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతాయని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు, బీహెచ్ఈఎల్ సీనియర్ కార్మిక నాయకుడు జి.ఎల్లయ్య మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ సోమవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు రెహమాన్ అధ్యక్షతన సంతాపసభను నిర్వహించగా, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ యాదవ్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ, పరిశ్రమ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన ఎలయ్య జ్ఞాపకార్థం భెల్ చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అధికార కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు కృష్ణంరాజు ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింలు, సీనియర్ కార్మిక నాయకులు దామోదర్‌రెడ్డి, జాషువా, బాలకిష్టయ్య, వలీఉద్దీన్, కొండారెడ్డి, జాషువా తదితరులు ఎల్లయ్య సేవలను గుర్తుచేసుకుంటూ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, నాయకులు గంగాధర్, శ్రీరాములునాయక్, శ్రీధర్, రాజేందర్ తదితరులతో పాటు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.
















## భారీ వర్షానికి కూలిన ఇల్లు


ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సూరంపల్లిలో కూలిన బొల్లం లక్ష్మి ఇల్లు

దౌల్తాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసలే నిరుపేద కుటుంబం ఆపైన ఆర్థిక ఇబ్బందులు ఇంతలో ఆ కుటుంబం నివాసం ఉండే పాత ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన బొల్లం లక్ష్మి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. బొల్లం లక్ష్మి- బొల్లం పోచయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పోచయ్య కొద్ది సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. లక్ష్మికి ఎలాంటి ఆస్తిపాస్తులు, వ్యవసాయ భూమి లేదు. ఆమె కూలి పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. అసలే రెక్కాడితేనే కానీ పూట గడవని కుటుంబానికి భారీ వర్షాలతో తలదాచుకునే పాత ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లుకు దరఖాస్తు చేసుకున్న పాత ఇల్లు ఉందని ఆ కుటుంబానికి ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించలేదు. రోడ్డున పడ్డ లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం , ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, చొరవ తీసుకొని ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని వేడుకుంటున్నారు.


## పేలిన గ్యాస్ సిలిండర్

● త్రుటిలో తప్పిన ప్రమాదం


గ్యాస్ సిలిండర్ పేలడంతో పూరిగా శిథిలం అయిన ఇల్లు

కౌడిపల్లి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలడంలో త్రుటిలో 20 మందికి ప్రాణాపాయం తప్పిన సంఘటన సోమవారం మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ తల్లి మార్చి 2025లో మృతి చెందింది. దీంతో సోమవారం బంధు మిత్రులతో కలిసి నెల తద్దినం సోమవారం ఏర్పాటు చేసుకొని వంటచేశారు. వంట చేసే సిలిండర్‌తో పాటు అదనంగా ఇంట్లో తెచ్చి పెట్టుకున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇల్లుతో పాటు ఇతర సామగ్రి పేలి పోవడం, 20 మంది బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు త్రుటిలో ప్రాణాపాయం నుండి బయట పడ్డారు. నర్సాపూర్‌లోని అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకుని మంటలను ఆర్పివేశారని అన్నారు. కౌడిపల్లి అర్ఐ శ్రీహరితో పాటు పోలిసులు సంఘట స్థలంకు చేరుకుని విచారణ చేపట్టారు

## జీవో 99ని సవరించాలని ఆందోళన


హుస్నాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు నాయకుల ఆందోళన

హుస్నాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబర్ 99ని సవరించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయాన్ని మాల మహానాడు నాయకులు ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ హాజరయ్యారు. దీనికి ముందు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా మంత్రి క్యాంపు కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడ జీవో 99 ప్రతులను దహనం చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం తీసుకవచ్చిన జీవో 99 రోస్టర్ విధానం ద్వారా మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో తీవ్ర నష్టం జరుగుతుందని, జీవో 99 సవరణ చేసి రోస్టర్ పాయింట్ 22 నుంచి 16కు తగ్గించాలని డిమాండ్ చేశారు.

## యువకుడి హత్య : ఇంటి ముందు మృతదేహం


జయప్రకాష్(ఫైల్)

పటాన్‌చెరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని ఇంటి ముందు పడేసిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కల్కిబోయ్ గ్రామానికి చెందిన జయప్రకాష్ (22) రెండేళ్లుగా ఐడీఏబొల్లారం పురపాలక పరిధి కేబీఆర్ కాలనీలో తల్లి రాధతో కలిసి ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మోటారుసైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఉదయం తల్లి లేచి చూసే సమయానికి ఇంట్లో కనిపించలేదు. పైఅంతస్థు నుంచి కిందికి చూసే సరికి నేలపై బోర్లా పడుకొని ఉన్నాడు. కుడికాలు మడమ భాగం చితికిపోయి, ముఖంపై, కళ్లపై, ముక్కుభాగాల్లో తీవ్రమైన గాయాలున్నాయి. ముక్కుభాగం నుంచి రక్తం కారుతోంది. ఎక్కడో కొట్టినసమయంలో రక్తస్రావం ఎక్కువగా జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. తల్లి రాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్ )

కొమురవెలి/శివ్వంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల వేర్వేరు కారణాలతో ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం నవాబ్‌పేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నవాబ్ పేట్ గ్రామానికి చెందిన బంగారి నాగరాజు (22) పరిశ్రమకు వెళ్లేవాడు. రెండు సంవత్సరాల నుంచి పరిశ్రమకు వెళ్లకుండా మద్యానికి బానిస అయ్యాడు. ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు కావడంతో ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

**కొమురవెల్లిలో మహిళ**

మండల కేంద్రంలో మనస్తాపంతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొమురవెల్లి మండలకేంద్రానికి చెందిన పోట్లచెరువు రాజవ్వ(50) తన కొడుకుకు వివాహమై నాలుగు సంవత్సరాలు అవుతుంది. అయినా సంతానం కలగలేదు. దీంతో మనస్తాపంతో సోమవారం ఇంట్లో వెంటిలేటర్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొల్చారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై అహ్మద్ మొహీయుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్ చెడు మండలం బద్రియా తండాకు చెందిన మెగావత్ టోక్యా (57) ఆదివారం రంగంపేట శివారులో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి , అక్కడ నుంచి సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి డాక్టర్ల సలహా మేరకు హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం టోక్యా మృతి చెందాడు. మృతుడి కుమారుడు మెగావత్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## వదిన కర్మకాండ కోసం వెళ్లి..

● స్నానానికి కుంటలో దిగి..

● ప్రమాదవశాత్తు మరిది మృతి


గోపి ప్రభాకర్(ఫైల్)

రామయంపేట,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం చనిపోయిన వదిన కర్మకాండ కోసం వచ్చి స్నానానికి ఓకుంటలో దిగిన మరిది మృత్యువాత పడ్డాడు. రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్‌లో సోమవారం ఈ విషాద ఘటన జరిగింది. ఘటన వివరాలు.. గ్రామానికి చెందిన ఆశావర్కర్ పుష్పలత కాలుకు గాయమై చికిత్స పొందుతూ ఐదు రోజుల క్రితం మృతి చెందింది. సోమవారం ఆమె కర్మకాండ జరగగా, గ్రామానికి చెందిన ఆమె మరిది గోపి ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులోని కుంటలో స్నానం చేసేందుకు దిగాడు. అక్కడ ఎక్సకవేటర్ గుంత ఉండటంతో అందులో మునిగి పోయాడు. అక్కడున్న వారు రక్షించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. ఐదు రోజులు వ్యవధిలో ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





గజ్వేల్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు, చేగుంట గాంధీ చౌరస్తా వద్ద రైతుల రాస్తారోకో, నర్సాపూర్‌లో ధర్నాలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్

# యూరియా బాధలు.. రోడ్డెక్కిన రైతులు

## గంటల తరబడి నిరీక్షించినా పంపిణీ లేక ఆగ్రహం.. ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన

నర్సాపూర్/శివ్వంపేట/రామాయంపేట/తూప్రాన్/చేగుంట/మాసాయిపేట/పెద్దశంకరంపేట/టేక్మాల్/సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/నంగునూరు/తొగుట/గజ్వేల్/రాయపోల్/కొండపాక/కుకునూరుపల్లి/హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట/కోహెడ/దౌల్తాబాద్/మిరుదొడ్డి/గుమ్మడిదల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనం, వారాంతంతో మూడు రోజుల పాటు సెలవులు రావడంతో యూరియా పంపిణీ ఆగిపోయింది. సోమవారం మళ్లీ ప్రారంభం కాగా, అన్ని చోట్ల అవే బాధలు కనిపించాయి. రైతులు ఒక్క బస్తా కోసం ఎగబడ్డారు. రైతువేదికలు, పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాలు, ఫర్టిలైజర్ షాపులకు ఉదయమే చేరుకుని పడిగాపులు కాశారు. చాలా చోట్ల సకాలంలో పంపిణీ చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మెదక్ జిల్లాలో

● శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద తూప్రాన్ - సంగారెడ్డి రహదారిపై రైతులు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. పీఏసీఎస్ సీఈవో మధు యాదవ్ అక్కడికి చేరుకుని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

● రామాయంపేటతో పాటు రాయిలాపూర్‌లో సోమవారం రైతులు భారీగా క్యూ కట్టారు. మహిళలు సైతం ఇంట్లో పనులు పక్కన పెట్టి తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాశారు. పట్టణంలోని రెండుచోట్ల ఎరువులు అందజేసినా రైతులకు సరిపడా అందలేదు. రాయిలాపూర్‌లో తెల్లవారకముందే సొసైటీ వద్ద చెప్పులు వరుసలో పెట్టారు. మరికొందరు పాసుబుక్, ఆధార్ జిరాక్స్‌లు ఉంచారు.

● చేగుంట రైతువేదిక వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరారు. యూరియా రావడం లేదని ఆగ్రహించిన అన్నదాతలు గాంధీ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. దీంతో మెదక్, రామాయంపేట, హైదరాబాద్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది.

● మాసాయిపేట రైతువేదిక వద్దకు ఉదయమే పెద్దఎత్తున రైతులు చేరుకుని బారులు తీరగా, యూరియా అందించకుండా ఆలస్యం చేస్తుండడంతో ఆగ్రహించిన రైతులు నిరసనను వ్యక్తం చేశారు. 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● టేక్మాల్‌లో రెండు ఫర్టిలైజర్ షాపుల వద్ద ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. రెండు లారీల్లో యూరియా లోడ్ వచ్చినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు వారికి మద్దతు తెలిపారు.

● తూప్రాన్ పట్టణానికి చెందిన నట్రాజ్ ట్రేడర్స్ సోమవారం 300 బస్తాల యూరియా ఎరువు రాగా, రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. రైతుల నుంచి ఆధార్, రైతు పట్టదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకొని ఒక్కొక్క రైతుకు ఒక యూరియా బస్తా అందజేశారు. చాలామందికి లభించకపోవడంతో వెనుదిరిగిపోయారు.

● పెద్దశంకరంపేటలో డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచే రైతులు పెద్దఎత్తున బారులు తీరారు. 465 యూరియా బస్తాలను లైన్‌లో వేచిఉన్న రైతులకు సరఫరా చేశారు.

### సిద్దిపేట జిల్లాలో

● సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడు ఆగ్రోస్ సేవా కేంద్రానికి లారీలో యూరియా లోడ్ రాగా, కేంద్రానికి వచ్చిన యూరియాను వేరే మండలానికి తరలించవద్దని, ఇక్కడే లారీ లోడ్ మొత్తం పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మెదక్-సిద్దిపేట రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఓ రైతును రూరల్ సీఐ బలవంతంగా పక్కకు తోసివేయడంతో రైతులు సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ ఆసుపత్రికి వెళ్తున్నామని, సర్టిఫికెట్లు చూపించడంతోనే వారిని పంపించాలని పక్కకు పంపించాను. కానీ వేరే దురుద్దేశంతో కాదు' అని సీఐ రైతులకు వివరించారు.

● చిన్నకోడూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి రైతులు ఉదయాన్నే చేరుకుని, మధ్యాహ్నం వరకు వేచిచూసిన పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించి, ఆందోళనకు దిగారు. ఏవో జయంత్‌కుమార్, ఎస్ఐ సైఫ్‌అలీ జోక్యంతో ముందస్తుగా టోకెన్‌లను అందజేయడంతో శాంతించారు.

● నంగునూరులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద రైతులు రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఓటీపీ విధానాన్ని రద్దు చేసి నేరుగా రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

● తొగుట సొసైటీ కార్యాలయం, ఆగ్రోస్ దుకాణం వద్ద ఉదయం నుంచే రైతులు వేచిచూశారు. 880 బస్తాల యూరియా రాగా, ఎక్కువ సంఖ్యలో రైతులు బారులు తీరడంతో ఒక్కొకరికి ఒక్క బస్తానే పంపిణీ చేశారు. దీంతో కొద్దిసేపు రైతులు ఆందోళన చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి జోక్యంతో మిగతా రైతులకు ముందస్తుగా టోకెన్‌లు అందజేశారు.

● గజ్వేల్ పట్టణంలో రైతులకు నిరాశే ఎదురుకావడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. బాబూజగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ధర్నాకు దిగారు.

● రాయపోల్‌కు ఫర్టిలైజర్ షాప్ వద్దకు ఉదయమే పెద్దఎత్తున రైతులు చేరుకున్నారు. చెప్పులు, ఆకులు, కొమ్మలను వరుసలో పెట్టారు. వచ్చిన యూరియా తక్కువగా ఉండడంతో సగం మందికి కూడా ఒక్కో బస్తా చొప్పున టోకెన్‌లు రాలేదు. దీంతో ఆగ్రహించి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.

● కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి, మర్పడగ, కొండపాక తదితర గ్రామాలకు యూరియా సరఫరా అయింది. విషయం తెలుసుకున్న రైతులు యూరియా కోసం బారులు తీరారు.

● కుకునూరుపల్లిలో రైతులు ఆదివారం రాత్రి నుంచే యూరియా టోకెన్‌ల కోసం రైతులవేదిక వద్ద నిద్రించారు. మరికొంత మంది 3 గంటలకు చేరుకుని క్యూలైన్‌లో వేచిఉన్నారు. తెల్లవారుజామున ఇంకొంతమంది చేరుకుని చెప్పులను వరుసలో పెట్టారు. ఉదయానికి పెద్దఎత్తున రైతులు ఉండడంతో అధికారులకు పాలుపోలేదు. ఎస్ఐ శ్రీనివాస్, ఏవో గోవిందరాజు రైతులతో మాట్లాడి ఒక్కో రైతుకి ఒక్క యూరియా బస్తా టోకెన్ మాత్రమే ఇచ్చారు. టోకెన్‌లు అందని రైతులు ఓపిక నశించడంతో రాజీవ్ రహదారిపైకి వచ్చి ధర్నా నిర్వహించారు.

● దౌల్తాబాద్‌లోని పీఏసీఎస్ కేంద్రానికి రైతులు పెద్దఎత్తున చేరుకున్నారు. ఎంతసేపటికీ యూరియా పంపిణీ చేయకపోవడంతో రైతులు గజ్వేల్ రోడ్డులోని వివేకానంద చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు.

● మిరుదొడ్డి మండలం అల్వాల రైతుల వద్ద ఆదివారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. రైతులకు యూరియాను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధర్మసమాజ్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు మండిపడ్డారు. అక్బర్‌పేటలో రైతులు రెండుగంటల పాటు రాస్తారోకోను నిర్వహించారు.


టేక్మాల్ ఆగ్రోస్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు


కుకునూరుపల్లి రైతువేదిక వద్ద నిద్రిస్తున్న రైతులు


రాయపోల్‌లో వరుసలో చెప్పులు, ఆకులు


రామాయంపేటలో ఆగ్రోస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

### కావాలని కేంద్రంపై బురదజల్లే యత్నం

నర్సాపూర్‌లో యూరియా కోసం నిరీక్షించి చేసేది లేక ప్రధాన రోడ్డుపై రైతులు ఆందోళనకు దిగారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకపోవడం వల్లనే రైతులు ఇబ్బంది పడుతున్నారని, కావాలని కేంద్రంలోని బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యూరియా పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బుచ్చేస్‌యాదవ్, గోడరాజేందర్, యాదగిరి, జిల్లా కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు నగేష్, పట్టణఅధ్యక్షుడు చంద్రయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### మోదీ దిష్టిబొమ్మలు దహనం


హుస్నాబాద్‌లో ప్రధాని మోదీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకే కేంద్రం యూరియా సరఫరా చేయడం లేదని నాయకులు ఆరోపించారు. రాష్ట్రానికి 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినా మోదీ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగంపల్లి ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కోహెడ అంబేద్కర్ విగ్రహం వద్ద రైతులు ఖాళీ సంచులతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

### సంగారెడ్డి జిల్లాలో

మెదక్, సిద్దిపేట జిల్లాలో ఉన్నంత యూరియా కొరత సంగారెడ్డి జిల్లాలో లేదు. అక్కడక్కడ మాత్రమే రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుమ్మడిదలలోని కోరమాండల్ కేంద్రం 600 మంది రైతులు నిరీక్షించారు. ఆధార్ కార్డు తీసుకొచ్చిన వారికి పోలీసు పహారాలో ఒక్కొక్కరికి రెండు బస్తాలు అందజేశారు. యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.

---

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపు

సిద్దిపేట క్రైమ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, పార్టీ కోసం అందరూ కలిసి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని నివాసంలో రాంచందర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితిపై వారు చర్చించారు. అనంతరం వారితో రాంచందర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. నాయకులందరినీ కలుపుకుని పోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. త్వరలోనే జిల్లాలో పర్యటిస్తానని పార్టీ శ్రేణులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలగామ శ్రీనివాస్, గాడిపల్లి భాస్కర్, సింగం సత్తయ్య, బాసంగారి వెంకట్, నత్తి మల్లేష్, దేవులపల్లి మనోహర్, సురేష్, పంజా అశోక్, లక్ష్మణ్ గౌడ్, తిరుపతిరెడ్డి, పెంటయ్య, పోచయ్య, చిక్కుడు చంద్రం, నాయిని సందీప్, నరసింహులు, గుండ్ల జనార్ధన్, సంతోష్, సురేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

---

# సిగాచిపై పోరుబాట

బాధితుల పక్షాన ప్రజాసంఘాలు

ఇప్పటికీ పావువంతే పరిహారం

యజమాన్యంపై చర్యలు శూన్యం

ఉద్యమానికి సిద్ధపడుతున్న పౌరసంఘాలు

నేడు ముత్తంగిలో రౌండ్ టేబుల్ సమావేశం


సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడుధాటికి కూలిన శిథిలాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్లు (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమ ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేదెన్నడో తెలియడం లేదు. దేశంలోని భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత జూన్ 30న ఇక్కడ జరిగిన ఘటనే పెద్దది. ఈ ఘటనలో 46 మంది మృతి చెందడం, ఎనిమిది మంది గల్లంతవ్వడం కలకలం సృష్టించింది. గల్లంతయిన వారితో సహా 54 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. గాయపడ్డ 28 మంది తీవ్ర అస్వస్థలతో రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముగ్గురు కార్మికులు వివిధ ఆసుపత్రులలో ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబాలన్నీ రోజు వారీ కూలీలు, తక్కువ ఆదాయ కుటుంబాల నుంచి వచ్చినవారే. వీరి జీవనోపాధి ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఇంతటి ఘోరానికి కారణమైన పరిశ్రమ యజమాన్య ప్రతినిధులపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయాల టర్నోవర్ ఉన్న కంపెనీ కనీస ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించలేదు. ఉల్లంఘనలను గుర్తించి కచ్చితంగా ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అగ్నిమాపక శాఖ అధికారులు విషయాన్నే పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన తర్వాత అన్నీ లోపాలేనంటూ నివేదికలు తయారు చేసి చేతులు దులుపుకున్నారు.

మరోవైపు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం అందిస్తానని సాక్షాత్తు సీఎం ప్రకటించినా, ఇంతవరకు యాజమాన్యం బాధిత కుటుంబాలకు కేవలం రూ. 25లక్షలే చెల్లించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కోర్టు అఫిడవిట్లో కూడా చెల్లింపుకు స్పష్టమైన కాలపరిమితి లేకపోవడంతో కార్మికులతో పాటు ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మరణించిన 15 మందికి ఇంకా మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేయకపోవడంపై కూడా ఆయా కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి.

### నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

సిగాచి పరిశ్రమలో మృతిచెందిన కుటుంబాలకు మిగిలిన పరిహారం తక్షణమే అందించాలని, గాయపడిన వారికి న్యాయం చేయాలని, యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. సైంటిస్ట్స్ ఫర్ పీపుల్, మానవ హక్కుల వేదిక, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ముత్తంగి పీఎస్ఆర్ గార్డెన్‌లో ఈ సమావేశం జరగనుంది. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సైంటిస్ట్స్ ఫర్ పీపుల్ నాయకులు, సిగాచీ కేసు పిటిషన్‌దారు డాక్టర్ కె. బాబురావు, సిగాచి పరిశ్రమపై పౌర సంఘాలు వేసిన కేసులో న్యాయవాది వసుధ నాగరాజ్, టీపీజేఏసీ కన్వీనర్ వై.అశోక్‌కుమార్, కన్నెగంటి రవి, రాష్ట్ర కో కన్వీనర్, విద్యా కమిషన్ సలహాదారుడు ఆర్.వెంకట్‌రెడ్డి, ఏపీసీర్ కన్వీనర్ డాక్టర్ ఉస్మాన్, మాంట్ ఫోర్ట్ సోషల్ ఇన్స్టిట్యూట్ నుంచి బ్రదర్ వర్గీస్, మానవ హక్కుల వేదిక నాయకులు రోహిత్, స్థానిక నాయకులు శ్రీకాంత్‌గౌడ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

---

## నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

● రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

చేగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం చేగుంట మండలంలోని చిటోజిపల్లి గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల పంట నష్టం జరిగినా, ఇప్పటివరకు ఒక్క రైతుకూ రూపాయి సహాయం అందించలేదని ఆయన మండిపడ్డారు.

## ఉపరాష్ట్రపతి మాక్ పోలింగ్‌లో జహీరాబాద్ ఎంపీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సోమవారం పార్లమెంటు ఆవరణలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. అందులో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. మాక్ పోలింగ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఇండియా కూటమిని బలపరుస్తున్న ఎంపీలు, రాజ్యసభ సభ్యులు హాజరయ్యారు.


కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి పక్కన సురేష్ షెట్కార్

---

## ఆలయాల్లో సంప్రోక్షణ

● తెరుచుకున్న గుడులు

దుబ్బాక/వర్గల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేసిన ఆలయాలు, సోమవారం ఉదయం మహా సంప్రోక్షణ అనంతరం తిరిగి తెరుచుకున్నాయి. భక్తులు దేవతా మూర్తులను దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దుబ్బాక, అక్బర్‌పేట - భూంపల్లి మండలాల్లోని అన్ని ఆలయాల్లో ఆగమోక్తంగా ఆలయ మహాసంప్రోక్షణ నిర్వహించారు. దుబ్బాకలోని నీలకంఠేశ్వరాలయం, పెద్దమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, వీరాంజనేయ ఆలయాల్లో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్బర్‌పేట - భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి కూడవెళ్లి రామలింగేశ్వరాలయంలో సాంకేత్‌శర్మ, చౌదర్‌పల్లి దుబ్బ రాజేశ్వరాలయంలో భానుశర్మలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం, వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలు సంప్రోక్షణ అనంతరం తెరచుకున్నాయి.


కూడవెళ్లి రామలింగేశ్వరాలయంలో రామలింగేశ్వరుడికి మహాసంప్రోక్షణ చేస్తున్న అర్చకుడు

---

# అపవాదు మాకు.. ఆర్భాటాలు మీకా?

మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎక్కడివి ?

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

సిద్దిపేట క్రైమ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష కోట్ల అవినీతి జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ కోరి, కేసీఆర్, హరీశ్‌రావులపై నిందలు మోపిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ ప్రశ్నించారు. అపవాదులు బీఆర్ఎస్ పార్టీకి, ఆర్భాటాలు, శంకుస్థాపనలు కాంగ్రెస్ పార్టీకా అంటూ ఆయన విమర్శించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరం కుంగిందని దుష్ప్రచారం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారని, మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి నీళ్లు తరలించే ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. రూ.7,500 కోట్లతో హైదరాబాద్ తాగునీటి పథకం కోసం మూసీ ప్రక్షాళన పేరిట గండిపేట వద్ద సీఎం శంకుస్థాపన చేయనున్నారని, కాళేశ్వరం వ్యర్థమని, నీళ్లు లేవని అబద్ధాలు పలికిన సీఎం ఇప్పుడు మల్లన్నసాగర్ నుంచి నీటిని ఎలా పంపింగ్ చేస్తారని ప్రశ్నించారు. ముందు మల్లన్నసాగర్‌లో స్నానం చేసి, కొమరవెల్లి మల్లన్న గుడిలో తప్పు ఒప్పుకొని, కేసీఆర్‌కు, తెలంగాణ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, దాని తర్వాతే మూసీ ప్రక్షాళనకు కొబ్బరికాయ కొట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమే గంధమల్ల, మూసీ ప్రక్షాళనకు వచ్చే గోదావరి నీళ్లు అని సీఎం గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే అసెంబ్లీలో కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసి, సీబీఐ విచారణ డిమాండ్ చేశారని, ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మోహన్‌లాల్, చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, ప్రభాకర్ వర్మ, కొండం రవీందర్ రెడ్డి, శ్రీహరి యాదవ్, ప్యాక్స్ చైర్మన్ కనకరాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### రూ.1.12 కోట్లతో సీసీరోడ్లు

పటాన్‌చెరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో రూ.1.12 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయని కార్పొరేటర్ మెట్టుకు మార్‌యాదవ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి ఆల్విన్‌కాలనీలో రూ.48.5, శిశుమందిర్ కాలనీలో రూ.62.9 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నామని వివరించారు.

### విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాయికోడ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని రాయికోడ్, మునిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో తన సొంత నిధులతో విద్యార్థులందరికీ స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు.

### వేణుగోపాల్‌కు ఎంపీడీవోగా పదోన్నతి

కంది, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంది ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌కు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను కొండాపూర్ ఎంపీడీవోగా బదిలీచేస్తూ ప్రభుత్వ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 1995లో సెప్టెంబరు 1న జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన వేణుగోపాల్ సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా అంచలంచెలుగా ఎదిగారు. మూడేళ్ల క్రితం కందిలో సూపరింటెండెంట్‌గా చేరిన వేణుగోపాల్ ఎంపీడీవోగా పదోన్నతి పొందడంపై కార్యాలయ అధికారులు, పలువురు నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

### 12న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలబాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ గణపతి తెలిపారు. 12న మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు టెన్త్ మెమో, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. క్రీడాకారులు 1.1.2006 సంవత్సరంలో పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9448686408, 9948321330, 8106841226 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

### భూ ఆక్రమణలపై ఫిర్యాదు

జిన్నారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ సర్వే నెంబరు 10లో భూ ఆక్రమణలు, సీలింగ్ భూమిలో 18 ఎకరాల స్థలానికి ఫౌతి చేయడంపై కాంగ్రెస్ నాయకుడు ఓంకార్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం గతంలో సీలింగ్ యాక్టు కింద 170 ఎకరాలను తీసుకోగా.. అందులో 18 ఎకరాలను ఓ వ్యక్తి పేరిట 2013లో భూ హక్కులు కల్పించారని తెలిపారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

### గ్రామీణ డిగ్రీ కళాశాలలను కాపాడుకోవాలి

జహీరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయా ప్రైవేటు డిగ్రీ కళాశాలల నాయకులు సిద్ధారెడ్డి, హరికుమార్, ఉదయబాను, మారుతీరావు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ప్రైవేటు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు జహీరాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు.

### 11న ఉద్యోగమేళా

జహీరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో ఈనెల 11న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణ సమీపంలోని మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలో అప్రెంటీస్ ప్రాతిపదికన 200 మంది యువతను పనుల్లోకి తీసుకోనున్నామన్నారు. యువత 18-25 సంవత్సరాల మధ్య వయస్కులై, 10, ఇంటర్, ఐటీఐ (అన్నిట్రేడ్‌ల్లో) ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని వారు కోరారు.



# 'ప్రజావాణి' సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దు

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజావాణికి 61 అర్జీలు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలోని సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ప్రజావాణికి మొత్తం 61 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఎప్పటికప్పుడు పరిశీలించాలి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వాటిని వెంటనే పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి మొత్తం 56 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అదనపు మాట్లాడుతూ.. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ.. సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### పోలీసు ప్రజావాణికి 13 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

### సత్వర పరిష్కారమే పోలీసుల ధ్యేయం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే పోలీసుల ధ్యేయమని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి మాట్లాడారు. సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో జిల్లా పోలీసు కార్యాలయంలో నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు విన్న అనంతరం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు ఆదేశాలు జారీచేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే



బంద్రాన్‌పల్లిలో ఇందిరమ్మ గృహం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ గృహాలను మంజూరుచేసి పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బంద్రాన్‌పల్లిలో ఇందిరమ్మ గృహం పనులకు భూమి పూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గానికి మొదటివిడతగా 3,500 గృహాలు మంజూరు కాగా.. వాటి నిర్మాణం పూర్తయిన వెంటనే మరో 1000 గృహాలు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఏఈ వంశీ, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, నాయకులు పండరిరెడ్డి, సంగయ్య, సర్దార్‌నాయక్ పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా పటాన్‌చెరు : మహిపాల్‌రెడ్డి




ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు జీఎంఆర్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. వందమంది ఉపాధ్యాయులను ఎస్పీ పరితోష్‌పంకజ్‌తో కలిసి సన్మానాలు చేసి మాట్లాడారు. ఈ ఏడాది నుంచి పటాన్‌చెరులో పాలిటెక్నిక్ కళాశాల తరగతులు ప్రారంభించామన్నారు. హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్నందున పటాన్‌చెరులో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఎస్పీ చెప్పారు. అనంతరం పటాన్‌చెరు మైత్రి మోదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, గౌసుద్దీన్ పాల్గొన్నారు.

## రాగిజావతో రక్తహీనత, పోషకాహారం లోపం దూరం



సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో రాగిజావ పంపిణీ చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రాగిజావతో రక్తహీనత, పోషకాహారం లోపం దూరమవుతుందని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లోని విద్యార్థులకు మంగళవారం రాగిజావను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, హెచ్‌ఎం విద్యాసాగర్, వయోజన విద్య ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

### మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో బాలయ్య, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలిరాజ్, కంది ఎంఈవో జోగప్ప, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రోత్సహించడానికే 'ఇన్‌స్పైర్ మనక్' : డీఈవో

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించడానికే ఇన్‌స్పైర్ మనక్ అని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పట్టణంలో అన్ని ప్రైవేటు పాఠశాలల సైన్స్ టీచర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల తప్పనిసరిగా ఇన్‌స్పైర్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థుల నామినేషన్లు వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ప్రాజెక్టు రూపకల్పన, రవాణా ఖర్చులకు రూ.10 వేలు ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈనెల 15 వరకు గడువు ఉందని, నామినేషన్ల సంఖ్యను పెంచాలన్నారు. అంతకు ముందు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నామినేషన్ల అప్‌లోడ్ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రెస్మా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ చౌదరి, ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం టేక్మాల్ మండలం దన్నూర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 378 ఇందిరమ్మ ఇళ్ల నిర్మిస్తున్న లబ్ధిదారులకు ఈ వారంలో రూ.3.88 కోట్ల బిల్లులు జమచేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.

### నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలి



తోర్నాల్ శివారులో నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండల పరిధిలోని తోర్నాల్‌లో సింగూరు బ్యాక్ వాటర్ ద్వారా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తోర్నాల్ శివారులోని జనార్దన్ రెడ్డి రైతు పొలానికి వెళ్లి నష్టపోయిన పంట పొలాన్ని పరిశీలించి మాట్లాడారు. సింగూరు బ్యాక్ బ్యాక్ వాటర్ ద్వారా 400 ఎకరాల్లో పంటలు నష్టపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

### గణేష్ మండళ్లపై కేసు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని గణేష్ మండపాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నవరాత్రుల్లో డీజే నిషేధించినా.. సౌండ్ పరిమితిపై సుప్రీం కోర్టు సూచనలు చేసిందన్నారు. సూచనలను బేఖాతరు చేస్తూ.. డీజే సౌండ్‌తో ప్రజలకు ఇబ్బంది కలిగించిన గజముక గణేష్ నిర్వాహకుడితో పాటు డీజే సౌండ్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నిమజ్జనం సందర్భంగా విధుల్లో ఉన్న కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కేబుల్స్‌ను కట్‌చేసి, పబ్లిక్ ప్రాపర్టీని డామేజ్ చేసిన నేతాజీ గణేష్ మండలి నిర్వాహకులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

### 'పెన్షన్ పెంచి ఇవ్వాలి'

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పింఛన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై పెన్షన్‌దారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు బాచుపల్లి పాండు, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి బొజ్జ సైదులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు వికలాంగులకు రూ.6, చేయూత పెన్షన్‌దారులకు రూ.4 వేలు వెంటలే అమలు చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు హుస్సేనగళ్ల మురళీ పాల్గొన్నారు.

## పోలీసు బందోబస్తు మధ్య మార్డి చెరువు సర్వే



మార్డి పెద్ద చెరువు వద్ద సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కల్హేర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్డి గ్రామ శివారులో కబ్జాకు గురైన పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ భూమిని పోలీసు బందోబస్తు మధ్య నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో గోవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి ఎకరం భూమిని కట్టలు వేసి కబ్జా చేసినట్లు ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాను అడ్డుకున్నారు. దీంతో గోవర్ధన్‌రెడ్డి తనకు పట్టాదారు పాసు బుక్కులో సూచించిన విధంగా భూమి చూపాలంటూ కోర్టును ఆశ్రయించడంతో కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, పోలీసు బందోబస్తుతో ఈ నెల 4న సర్వే పనులు చేపట్టగా తమకు ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేస్తున్నారని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతికి ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, మహేష్, దుర్గారెడ్డి బందోబస్తు ఆధ్వర్యంలో తహసీల్దార్, నీటిపారుదల శాఖ డీఈఈ జలేందర్, ఏఈలు రవీందర్, శ్రీవర్ధన్‌రెడ్డి సమక్షంలో సర్వే చేపట్టారు. రికార్డుల ప్రకారం కబ్జాకు గురైన భూమితో పాటు ఇదివరకు గోవర్ధన్ రెడ్డి వ్యవసాయం చేస్తున్న మరో ఎకరం భూమి కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోకే వచ్చినట్లు సర్వేలో అధికారులు తేల్చినట్లు తెలిసింది.

## విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో ఎంఈవో

హవేళిఘణపూర్/రామాయంపేట/నిజాంపేట/అల్లాదుర్గం/నర్సాపూర్/మాసాయిపేట/చిన్నశంకరంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవో మధుమోహన్ తెలిపారు. గురుపూజోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని శ్రీసాయి శ్రీనివాస గార్డెన్‌లో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు కరుణాకర్, నాగుల్‌మీరా, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రామాయంపేట మండలంలో ఎంపిక చేసిన 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజిని, ఎంపీడీవో సాజలుద్దీన్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు. నిజాంపేట మండలంలో 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో సొంగని యాదగిరి సన్మానించారు. అల్లాదుర్గం మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారిని విద్యా వనరుల కేంద్రంలో సోమవారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయగౌడ్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు జనార్దన్, వీరప్ప, సత్యనారాయణ, రంజిత్ పాల్గొన్నారు. నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీవో మధులత సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తారాసింగ్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. మాసాయిపేట మండల వనరుల కేంద్రంలో 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో లీలావతి సన్మానించారు. చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను ఎస్‌ఐ నారాయణగౌడ్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నాగరాజు సన్మానించారు.

### రైతులకు అందుబాటులో యూరియా



యూరియాపై సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్/చేగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ డివిజన్‌లో రైతుల వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్‌తో కలిసి యూరియా నిల్వలపై సమీక్షించారు. యూరియాపై రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, అవసరానికి తగినట్లుగా యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమీక్షలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ శివానందం, ఏవోలు గంగమల్లు, రాజేశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. యూరియా కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే మండలానికి 400 మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా పంపిణీ చేశామని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ తెలిపినట్టు ఆయన వెల్లడించారు. మరింత యూరియాను సరఫరా చేయడానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్, ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, ఆర్‌ఐ జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

### హరీశ్‌రావును కలిసిన మోయిద్‌ఖాన్



హరీశ్‌రావుతో మోయిద్‌ఖాన్

నారాయణఖేడ్/రేగోడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోయిద్‌ఖాన్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కొద్దిరోజులుగా జాగృతి నాయకురాలు కవిత హరీశ్‌రావుపై ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆయనను కలిసి తామంతా మీవెంటే అంటూ సంఘీభావం తెలిపారు. అలాగే బీఆర్‌ఎస్ రేగోడు మండల నాయకులు కూడా హరీశ్‌రావును సోమవారం కలిశారు.

### పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి అనిల్‌కుమార్




పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను కలిసిన గాలి అనిల్‌కుమార్

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గాంధీభవన్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ హాజరయ్యారు. పదవిలోకి వచ్చి ఏడాదికాలం పూర్తయినందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం కామారెడ్డిలో నిర్వహించనున్న ఓట్‌చోర్ గద్దీచోడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో పార్టీ గెలుపుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ నటరాజన్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

### గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

నర్సాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, మాజీ ఎంపీపీ లలిత పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పోరు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటం చేస్తామని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి అశోక్ తెలిపారు. సంగారెడ్డిలోని సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు దళితులందరికీ చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా అంబేద్కర్ అభయహస్తం ద్వారా రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి రెండేళ్లు గడుస్తున్నా అతీగతీ లేదని ఎద్దేవా చేశారు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుపై ప్రజలు జాగ్రత్త వహించాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని కామారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పలు ఇళ్ల వద్ద పాత కుండీలు, ప్లాస్టిక్ డ్రమ్ములను తొలగించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సుహాసిని, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలను సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

### 'ఓటరు' సమావేశానికి స్పందన కరువు

వెల్దుర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సన్నాహకంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై వివిధ పార్టీల అధ్యక్షులు, నాయకులతో ఎంపీడీవో ఉమాదేవి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కేవలం బీజేపీకి చెందిన పార్టీ అధ్యక్షుడు దాసు, ఉపాధ్యక్షుడు బాలకిషన్, సీపీఎం మండల నాయకులు గౌరీ మాత్రమే హాజరయ్యారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు, నాయకులు హాజరుకాకపోవడంపై పలువురు మండిపడుతున్నారు. ఎన్నికల విధుల్లో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించే అధికారులు ప్రభుత్వ ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు.

### రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

జిన్నారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిన్నారం గురుకుల పాఠశాల విద్యార్థులు మూడోస్థానంలో నిలిచారు. ఈనెల 5 నుంచి 7 వరకు నిర్మల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో గురుకుల పాఠశాలకు చెందిన సబ్ జూనియర్ కేటగిరీలో వసంత్‌రావు, జూనియర్ కేటగిరీలో సంతోష్ మూడోస్థానంలో నిలిచి బ్రౌన్జ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుదీంద్ర తెలిపారు.

### ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న వ్యక్తులపై కేసు

శివ్వంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న వ్యక్తులపై కేసు నమోదైంది. మండల పరిధిలోని కొత్త రూప్లాతండా చౌరస్తాలో లక్ష్మణ్ తనకు సంబంధించిన భూమిలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాడు. స్లాబ్ లెవల్ వరకు పూర్తికాగా.. ఇంటి గోడల నిర్మాణం చేయొద్దని ఇదే తండాకు చెందిన రామ్‌సింగ్‌తో పాటు వారి కుటుంబీకులు రెండేళ్ల నుంచి తమను రానివ్వడం లేదని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న ఇంట్లో రామ్‌సింగ్ భార్య మృతిచెందిన వారి ఫోటోను పెట్టి తమ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని లక్ష్మణ్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రామ్‌సింగ్‌తో పాటు వారి కుటుంబీకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.